కల్వర్టులతో కలవరం

- ప్రమాదాల బారిన పాదచారులు
- ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోని అధికారులు



శ్రీనగర్‌లో అసంపూర్తి పనులతో వదిలేసిన కల్వర్టు

కంచరపాలెం: జీవీఎంసీ పరిధిలోని 54, 55 వార్డులైన కంచరపాలెం–ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లోని బీఆర్‌టీఎస్ రహదారులకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా తయారయ్యాయి. సరైన నిర్వహణ లేకపోవడంతో ఈ ఫుట్‌పాత్‌లు శిథిలావస్థకు చేరుకోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుట్‌పాత్‌లపై నిర్మించిన కల్వర్టులు, డక్‌లు, మురుగు కాలువలు ప్రమాదకరంగా ఉండటంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్ అధికారులు శానిటరీ సిబ్బంది స్పందించకపోవడంతో పరిస్థితి మరింత దిగజారుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయా ప్రాంతాల్లో తరచూ పాదచారులు, వాహనదారులు ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.



రెడ్డికంచరపాలెం ప్రాంతంలో ప్రమాదభరితంగా కల్వర్టు

అసంపూర్తి పనులతో అవస్థలు

కంచరపాలెం మెయిన్‌రోడ్డు నుంచి ఊర్వశికూడలి పరిసరాల్లోని బీఆర్‌టీఎస్ మార్గంలో జరుగుతున్న అసంపూర్తి పనులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా కల్వర్టులపై తొలగించిన పలకలను సక్రమంగా తిరిగి వేయకపోవడంతో రహదారి ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల పలకలు వేసినా, మరికొన్ని చోట్ల పెద్ద రంధ్రాలు అలాగే వదిలేయడంతో అవి ప్రమాదకరమైన బావులను తలపిస్తున్నాయి. ఈ రంధ్రాల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు పడితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు, ఆయా ప్రాంతాల్లో సిమెంటు దిమ్మెలను చిందరవందరగా వేయడం వల్ల పాదచారులు నడిచేందుకు ఇబ్బందిగా మారింది. ఈ దిమ్మెలకు తగిలి చాలామంది గాయాలపాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, అసంపూర్తిగా ఉన్న బీఆర్‌టీఎస్ పనులను పూర్తి చేయాలని, కల్వర్టులపై తొలగించిన పలకలను సరిగ్గా అమర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో మరింత ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.

పర్యవేక్షణ కరువు

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన పరిసర ప్రాంతాల్లోని మురుగు కాలువలు ప్రమాదకరంగా మారాయి. పూడికతీత కోసం తొలగించిన సిమెంటు పలకలను జీవీఎంసీ సిబ్బంది తిరిగి సరిగా అమర్చకపోవడంతో కాలువలు తెరిచి ఉన్నాయి. ఈ కారణంగా పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. జాషువానగర్, కొత్తరెడ్డికంచరపాలెం, అశోక్‌నగర్, రెడ్డికంచరపాలెం, వివేకానందవీధి, శ్రీనగర్, రవీంద్రనగర్, దేవేంద్రనగర్, సిద్ధార్థనగర్, గజపతినగర్, సుంకురపేట, బాపూజీనగర్, మహారాణివీధి, ఊర్వశి కూడలి మరియు కంచరపాలెం రైతుబజారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి, ఈ ప్రమాదకరమైన కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. తొలగించిన పలకలను తక్షణమే అమర్చి, ప్రజల భద్రతను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఐటీఐ జంక్షన్‌లో ప్రమాదభరితంగా సిమెంట్ దిమ్మెలు

భయంగా ఉంది



ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా మారాయి. మురుగు కాలువల పూడికతీత తర్వాత పలకలను సరిగా అమర్చకపోవడంతో నడవడం కష్టంగా మారింది. రోడ్డుపై వాహనాల భయం, ఫుట్‌పాత్‌లపై ప్రమాదకరమైన రంధ్రాలతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– కె.చిన్నా, కంచరపాలెం

చర్యలు తీసుకుంటాం



బీఆర్‌టీఎస్ రహదారుల అభివృద్ధిలో ఎదురైన సమస్యల కారణంగా కొన్ని పనులు ఆలస్యమయ్యాయి. అయితే పూడికతీత సమయంలో తొలగించిన పలకలను సరిగా అమర్చాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. అసంపూర్తి పనులను త్వరలో పూర్తి చేస్తాం.

–బొడ్డేపల్లి రాము, జోన్ 5 కమిషనర్

క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ అభిమాని సనపల గోపీ కుమారుడు సనపల హిరణ్ 2వ వర్ధంతి సందర్భంగా కళింగనగర్ బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మజ్జిగ పంపిణీ చేశారు. పైడిరాజు, శ్యామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. శ్రీనివాస మకరందం సంపూర్ణ ప్రదర్శన నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంస్కృతి, సంప్రదాయలతో ఉత్తమ విద్య



సాయి చైత్రకు నగదు బహుమతి అందజేస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

సీతంపేట: టెన్త్ సీబీఎస్‌ఈ ఫలితాల్లో శ్రీకృష్ణ విద్యామందిర్ 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని పాఠశాల కార్యదర్శి వి.ఆర్.సత్యనారాయణ తెలిపారు. పరీక్షకు హాజరైన 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, కె.సాయి చైత్ర 486/500 మార్కులతో టాపర్‌గా నిలిచిందని ఆయన శనివారం జరిగిన అభినందన సభలో పేర్కొన్నారు. 28 మంది 90శాతం పైగా మార్కులు సాధించగా, మిగిలిన వారంతా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని ఆయన చెప్పారు. బీవీకే విద్యాసంస్థల చైర్మన్ ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థలు విద్యతో పాటు భారతీయ సంస్కృతిని అందిస్తున్నాయని తెలిపారు. టాపర్ సాయి చైత్రకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, కోశాధికారి, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే ఏజీఎం తనిఖీలు



అరణ్యలో సదుపాయాలను పరిశీలిస్తున్న ఏజీఎం మోహెస్‌కుమార్ బెహరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహరా శనివారం వాల్తేర్ డివిజన్‌లో పర్యటించి, తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం పోర్ట్ ఏరియా, అదాని గంగవరం పోర్ట్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, సైడింగ్, లోడింగ్ పాయింట్స్, ఇతర సదుపాయాలను, పలు కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విశాఖ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, పరిశీలించి, రేక్‌ల సామర్థ్యాన్ని పెంచి కార్గో రవాణాకు మరింత ప్రోత్సాహమివ్వాలని ఆయన కోరారు. రైల్వే నుంచి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. అనంతరం వాల్తేర్ డివిజన్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల వేదిక అరణ్యను పరిశీలించారు. ఈ ప్రదేశంలో క్లైంబింగ్ వాల్, టైర్ వాల్, టైర్ టవర్, రోప్ క్లైంబర్, హర్డిల్‌పాసర్, టైర్ క్రాసింగ్, మంకీ బ్రిడ్జి, కమాండో బ్రిడ్జి, టైర్ టన్నెల్, మౌగ్లీ జంపింగ్, ఫుట్ వాకర్ వంటి సాకర్యాలను పరిశీలించారు. వీటిని స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్ఎం లలిత్ బోరా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో ఆర్డినేషన్) ఏకే మహరాణా, పోర్ట్ సీఈవో అమిత్‌మాలిక్, ఇతర సీనియర్ అధికారులు, వాల్తేర్ డివిజన్ సీనియర్ అధికారులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి



కల్యాణంలో పాల్గొన్న దంపతులు



ఉత్సవ మూర్తులు

సీతంపేట: స్థానిక శంకరమఠం రోడ్‌లోని రామలింగేశ్వరాలయంలో శ్రీపార్వతి సహిత రామలింగేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించారు. అనంతరం పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సుమూహుర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారికి తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంపిణీ చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. ఈవో జి.వి. రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం వసంతోత్సవం, రాత్రి పుష్పోత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో 11.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 11.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ వారి సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కాకినాడ జిల్లాకు చెందిన మోర్త విజేంద్ర, పి.సంతోష్‌కుమార్ విశాఖ స్టేషన్ మీదుగా కాకినాడకు అక్రమంగా గంజాయిని రవాణా చేయడాన్ని ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితులను జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా.. వీరి వద్ద నుంచి రూ.57,650 విలువైన 11.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాదారులను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్యామ్‌బాబు

మద్రిపాలెం: ఓల్టేజీ సమస్యను నివారించేందుకు విద్యుత్ శాఖ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. నగర సూపరింటెండింగ్ ఇంజినీర్(ఎస్ఈ) జి.శ్యామ్‌బాబు, జోన్–2 ఈఈ బీకే నాయుడు శనివారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చార్జ్ చేసి ప్రారంభించారు. ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని తెన్నేటినగర్, సీతన్న గార్డెన్స్, కళింగనగర్, మాధవధార ప్రాంతాల్లో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, స్థానికులకు ఎటువంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు, నిరంతరాయంగా సరఫరాను అందించేందుకు ఏర్పాటు చేశామని శ్యామ్‌బాబు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



వాకర్స్‌తో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బి.రాము మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతల నుంచి బయటపడేందుకు పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమని పిలుపునిచ్చారు. బీట్ ద హీట్‌కు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. వాకర్స్‌తో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, ఎస్‌ఎస్ జనార్దన్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యం

స్వచ్ఛ పరిసరాలకు ప్రాధాన్యమిద్దామని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రాంగణంతోపాటు పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. నెలలో ఒకసారి 'నో పార్కింగ్ జోన్' పాటించాలని, ఆరోజు కాలేజీ సిబ్బంది వాహనాల్లో కాకుండా సైకిల్, నడక ద్వారా చేరుకుంటే మంచిదని సూచించారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. బీట్ ద హీట్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ శనివారం కాలేజీలోకి వాహనాల ప్రవేశాన్ని నిలిపివేశారు. కాలేజీ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని బాలికలు, బాలుర పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో మూడో శనివారం సందర్భంగా 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధి–శిక్షణా శాఖ కంచరపాలెం రైతుబజారు ఎస్టేట్ అధికారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఐటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ ఉమా శంకర్, ఎస్టేట్ అధికారి జగదీశ్వరరావు, కుట్టా కార్తీక్, సిబ్బంది, రైతులు, విద్యార్థులు , కూటమి నాయకులు పాల్గొన్నారు.

'బీట్ ద హీట్'పై అవగాహన

తాటిచెట్లపాలెం: స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్రలో భాగంగా శనివారం సీతమ్మధారలో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఎండల బారిన పడకుండా సీనియర్ సిటిజన్లు, పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి జీవీఎంసీ సిబ్బంది వివరించారు. శానిటరీ వర్కర్లకు టోపీలు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందించారు. జీవీఎంసీ జోన్–3 కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు, అడ్మిన్ సెక్రటరీలు, హెల్త్ సెంటర్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీవో, ఆర్పీలు, నాయకులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ ఆదా

మద్రిపాలెం: సోలార్ రూఫ్ టాప్ ఉపయోగించడం ద్వారా విద్యుత్ ఆదా చేయొచ్చని ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. పీఎం సూర్యఘర్ యోజనాపై విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందితో కలిసి శనివారం మాధవధార ఎస్ఎస్‌టీఎల్ జంక్షన్ నుంచి మాధవధార మీదుగా బిర్లా కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్ వాడటం వల్ల కరెంట్ బిల్లును గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రతి ఇంటిపై పీఎం సూర్యఘర్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సీతమ్మధార రైతుబజార్‌లో చలివేంద్రం



మజ్జిగ అందిస్తున్న ఈవో కృష్ణమూర్తి

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌లో శనివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వినియోగదారులకు, రైతులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు వచ్చే సమయంలో కచ్చితంగా టోపీ, లేదా గొడుగు తీసుకురావాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రైతులు ప్రతిజ్ఞ చేశారు. సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

26వ వార్డులో మెగా ఫాగింగ్



అక్కయ్యపాలెంలో మెగా ఫాగింగ్

సీతంపేట: దోమల నియంత్రణలో భాగంగా జీవీఎంసీ మలేరియా విభాగం శనివారం సాయంత్రం 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో మెగా ఫాగింగ్ నిర్వహించింది. 80 అడుగుల రోడ్, నారాయణ స్కూల్ లైన్, జీవీఎంసీ స్కూల్ లైన్, ఆరోగ్య కేంద్రం లైన్, భారత్ గ్యాస్, పద్మశ్రీ ఆసుపత్రి, టీడీపీ ఆఫీస్, కమల్ ఆర్కేడ్, రమ్య అపార్టుమెంట్, ఎన్జీజీవోస్ కాలనీ, శాంతిపురం ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. సూపర్ వైజర్లు కె.ఎస్.ఎస్. నారాయణ, రాంబాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా, వారానికి ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

'లోకావలోకనం' కవితా సంపుటి ఆవిష్కరణ

సీతంపేట: సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ రచించిన 'లోకావలోకనం' కవితా సంపుటి ఆవిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకంలోని కవితలు సమాజంలోని వివిధ కోణాలను కవితాత్మకంగా ఆవిష్కరించాయని ప్రశంసించారు. డాక్టర్ డీవీ సూర్యారావు కవిత్వం సమాజానికి ఔషధం లాంటిదన్నారు. గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.